క్లుప్తంగా

ఘనంగా మల్లన్న జాతర



బండ్ల ఊరేగింపు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి.ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మొదటిరోజు స్వామి వారికి పుట్ట బంగారం ఊరేగింపు, అభిషేకం, అలంకరణ నిర్వహించారు. సాయంత్రం ఎండ్ల బండ్లను ఊరేగించి పోచమ్మను దర్శించుకున్నారు. ఆదివారం మల్లికార్జున స్వామికి బండ్ల ఊరేగింపు, సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

ఓటరు దరఖాస్తుల పరిశీలన



ఓటరు దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్ఐ వెంకటేశ్వర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): కొత్తగా వచ్చిన ఓటరు దరఖాస్తుల్లో తప్పులు సరి చూసుకోవాలని ఆర్ఐ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని చిట్కుల్ గ్రామంలో వచ్చిన కొత్త దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిన్నటి శుక్రవారంతో కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకునే అవకాశం ముగిసిందన్నారు. ఓటరు జాబితాలో ఉన్న వ్యక్తి, మరోసారి దరఖాస్తు చేసుకుంటే వాటిని తొలగించాలని, అదేవిధంగా జాబితా నుంచి మృతి చెందిన ఓటర్ల వివరాలు తొలగించాలని బీఎల్ఓలకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ శ్యామల ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదు పరిశీలన



దరఖాస్తుల డేటా ఎంట్రీ పరిశీలిస్తున్న కృష్ణయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజాపాలన దరఖాస్తుల డాటా నమోదు కార్యక్రమాన్ని పరిశీలించామని మండల ప్రత్యేకాధికారి కృష్ణయ్య అన్నారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభమైన డాటా ఎంట్రీ వివరాల గురించి తహసీల్దార్ ముసాద్దిక్, ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. మండలంలో డాటా నమోదు కోసం 14 మంది ఆపరేటర్లు ఉన్నారని, ఆరు రోజుల్లో మండలంలో వచ్చిన అన్ని దరఖాస్తుల డాటా నమోదు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఓ వెంకటేశ్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వేదశ్రీ చేతులమీదుగా ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించామని ఎస్టీయూ జిల్లా అదనపు కార్యదర్శి నరేశ్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఎస్టీయూ కృషి చేస్తుందన్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి నవీన్, పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేత



సర్టిఫికెట్ అందిస్తున్న ఫల్గుణ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని యువజ్యోతి ఫుట్‌బాల్ అకాడమీకి చెందిన జాతీయస్థాయి క్రీడాకారుడు శరత్‌చంద్రకు రాష్ట్ర ఫుట్‌బాల్ అకాడమీ కార్యదర్శి ఫల్గుణ సర్టిఫికెట్ అందజేశారు. ఈ మేరకు లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో శరత్‌చంద్రను జాతీయస్థాయి క్రీడాకారుడిగా గుర్తిస్తూ సర్టిఫికెట్ అందజేశారని యువజ్యోతి కోఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, సత్యనారాయణ, అహ్మద్ విద్యార్థిని ప్రశంసించారు.

వరి వైపే మొగ్గు

పంట మార్పిడిపై ఆసక్తి చూపని రైతులు



నాటేసేందుకు సిద్ధమవుతున్న వరి నారుమడి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతన్నలు ఎక్కువగా వరి పంట వైపు మొగ్గు చుపుతూ మిగతా పంటల సాగు పైన దృష్టి సారించడం లేదు. అన్ని రకాల పంట సాగుపై అవగాహన ఉన్న రైతులు సైతం వరి సాగునే ఎన్నుకుంటున్నారు. తరచూ వరిసాగు చేయడంతో భూసారం తగ్గి అధిక దిగుబడి కన్నా.. భవిష్యత్‌లో మాములు దిగుబడి సాధించడం కష్టమే.

చిలప్‌చెడ్ మండలంలో గత యాసంగిలో సీజన్‌లో సుమారుగా 12 వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తే, ప్రస్తుత సీజన్‌లో 11.4 వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా. మండలం ఎక్కువగా మంజీరా పరివాహక ప్రాంతం ఉండటంతో రైతులు వరి సాగునే ఇష్టపడుతున్నారు. మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల్లోని రైతులు గతంలో వరి సాగులో అధిక దిగుబడి సాధించేవారు. దీంతో వరి సాగునే ఇష్టపడుతున్నారు. మండలంలో చెరుకు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, కూరగాయాలకు కూడా సారవంతమైన నేలలు ఉన్నా..వీటిని తక్కువగా సాగు చేస్తారు.

చెరుకు పంట సాగుకు సంవత్సర కాలం సాగు, సరైన రవాణా వ్యవస్థ, చుట్టూ పక్కల అందుబాటులో చక్కెర పరిశ్రమలు లేకపోవడంతో చెరుకు సాగు తగ్గించామని పలువురు రైతులు తెలిపారు. ప్రస్తుతం రైతులు వేసిన తుకాలు ఎదగకపోతే సంక్రాంతి తర్వాత పెసర, మినుములు సాగు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు అంటున్నారు. గతంలో వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వెళ్లి వారి భూమి పరీక్ష చేయించి, వాటి ఫలితాలను కూడా రైతులకు అందించారు. తమ నేల సారాన్ని బట్టి పంటలు వేయాలని అధికారులు చెప్తున్నారు.

వరి సాగు చేస్తున్నా



చిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే తెలిసింది వరి సాగు మాత్రమే. దాంతో ప్రస్తుతం నాలుగెకరాలు వరి సాగు చేస్తున్నా. గత యాసంగి సీజన్లో సరైన సమయంలో నీటి వసతి లేకపోవడంతో కొంతవరకు నష్టపోయా. నీటి సౌకర్యం ఉండడంతో వరి సాగు చేస్తున్నా.

– గొట్టం గోవిందు, రైతు, చిలప్‌చెడ్

అవగాహన కల్పించాం



మండలంలోని రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాం. నీటి వనరులు లేని రైతులకు ఆరుతడి పంట సాగు చేయాలని సూచించాం. భూసారాన్ని బట్టి నేలలో ఉన్న పోషకాలను వినియోగించుకొని వాటికి తగ్గ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించాం.

– బాల్‌రెడ్డి, ఏఓ

అర్హులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



గోమారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం శివ్వంపేట, గోమారం, రత్నపూర్, శభాష్‌పల్లి, తాళపల్లి తండాల్లో ప్రజాపాలన నిర్వహించారు. గోమారంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు పార్టీలకు అతీతంగా ముందుంటామన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, శివ్వంపేట ఎంపీడీఓ భారతి, మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, మనోహరాబాదు ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఆర్ఐ కిషన్, సర్పంచ్‌లు లావణ్య, పార్వతి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోటీల్లో రాణించిన విద్యార్థులు



పతకాలతో విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు మహారాష్ట్ర వాళ్లు నిర్వహించిన ఆన్‌లైన్ రంగోత్సవ్ చిత్రలేఖన పోటీల్లో పలువురు విద్యార్థులు రాణించినట్లు హెచ్‌ఎంలు వెంకటస్వామి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చిత్రలేఖనంలో ఉత్తమంగా రాణిస్తున్నారన్నారు. ఆగస్టులో జరిగిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ పోటీల్లో తమ విద్యార్థులు 72 మంది పాల్గొని రాణించారని, వీరిలో 16 మందికి బెస్ట్ ట్రోఫీతో పాటు, పలువురికి బంగారు పతకాలు, సిల్వర్, బ్రోంజ్ పతకాలతో పాటు ప్రశంస పత్రాలు వచ్చాయన్నారు.

మంత్రిని కలిసిన జెడ్పీటీసీ



మంత్రితో జెడ్పీటీసీ, జిల్లా కోఆప్షన్ సభ్యుడు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ జెడ్పీటీసీ సర్పని సరోజ, జిల్లా కోఆప్షన్ సభ్యుడు యూసూఫ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శనివారం మెదక్‌లో కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు అడివయ్య, కాంగ్రెస్ టౌన్ యూత్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'భారత్ వికసిత్' సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయ్ కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ, చల్మెగ గ్రామాల్లో శనివారం భారత్ వికసిత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ పేదవాడికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ముద్ర లోన్లు ఇన్సూరెన్స్ విశ్వకర్మ తదితర రుణాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు లద్ద ప్రీతి, నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు సురేశ్, బాల్‌రెడ్డి, సెక్రటరీలు ఆరిఫ్ హుస్సేన్, నర్సింహరెడ్డి, ఇన్‌చార్జి నోడల్ ఆఫీసర్ భాస్కర్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, రమేశ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్లాట్ల అమ్మకాలు నిలిపివేయండి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని మూత పడిన జయకృష్ణ కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములు ఉన్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ సురేశ్, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. వెంచర్ అక్రమాలపై మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంచర్‌లో ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు ఉన్నాయని, పట్టా భూములతో పాటు వాటిని కలిపి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నందున అందులో ప్లాట్లు కొనే వ్యక్తులు ముమ్ముందు నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుమ్మక్కై వెంచర్‌లో ప్లాట్ల అమ్మకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి ఎంతో విలువైన ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములను కాపాడాలని, పేదలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య అక్షింతల ఊరేగింపు



హవేళిఘణాపూర్(మెదక్): బూర్గుపల్లిలో అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): గౌతాపూర్‌లో అయోధ్య అక్షింతల ఊరేగింపు



కౌడిపల్లి(నర్సాపూర్): ధర్మాసాగర్‌లో అక్షింతలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అయోధ్య రామ మందిర అక్షింతలను ఊరేగించారు. ఈ సందర్భంగా రామ నామ సంకీర్తనలు చేస్తూ అక్షింతలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామసున్నలు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శ్రీరామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రామ నామ నినాదాలతో గడపగడపకు అందజేశారు. కార్యక్రమంలోశ్రీరామ జన్మభూమి తీర్థ కమిటీ సభ్యులు గ్రామ పురోహితులు వేలేటి రామ్మోహన్ శర్మ, శనగపల్లి తిరుపతి, జీపీ స్వామి, చంద్రశేఖర్, నరేందర్, మహేశ్, వెంకటేశం, వినోద, మాసుల నాగరాజు కరుణాకర్, కృష్ణ, ప్రశాంత్, కుమార్, శ్రీరాములు, విశ్వేశ్, ధనంజయ, ప్రవీణ్ పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలో గౌతాపూర్, చిట్కుల్ గ్రామాల్లో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వరూప, గోపాల్‌రెడ్డి, భజన భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరామ అక్షింతల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): శ్రీరామ మందిరం అక్షింతలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఇంటింటికీ పంపిణీ చేశారు. మండలంలోని మహ్మద్‌నగర్, ధర్మాసాగర్ తదితర గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో ..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి అయోధ్య రామ మందిర అక్షింతలను ఆలయంలో పూజలు చేసి ఇంటింటికి పంపిణీ చేశారు. చిట్యాల చిట్యాల శ్రీనివాస్, మెంగరబోయిన వెంకట్, సురేందర్‌గౌడ్, బాల్‌రాజ్, శ్రీకాంత్, రమేశ్, సాయిలు, సత్యనారాయణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో అయోధ్య అక్షింతలను శనివారం ఇంటింటా పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు శ్రీరాముడి దేవాలయ చిత్రం, కరపత్రాన్ని అందించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతీ ఒక్కరు ఇంట్లో ఐదు దీపాలను వెలిగిస్తూ, హనుమాన్ చాలీసా పారాయణం చేయాలని కోరారు.



టేక్మాల్: బొడ్మట్‌పల్లిలో..



నిజాంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్రీరామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో శ్రీరామతీర్థ ట్రస్ట్ సభ్యులు మల్లికార్జున్, శంకర్, లచ్చల్, రాజు, మంజుల, మహిళలు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లత, నాయకులు కృష్ణాగౌడ్, రాము పంతులు, మహిళలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం



గెలుపొందిన చిన్నారులతో ఎంఈఓ, డైరెక్టర్ తదితరులు

నర్సాపూర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. పట్టణంలోని డాన్ బాస్కో స్కూలులో మూడు రోజులుగా చేపట్టిన క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడుతూ... క్రీడలతో శరీర ధారుడ్యం, ఏకాగ్రత సాధ్యమవుతుందని, పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేఘన తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, రన్నింగ్ క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రజాపాలనతో ప్రజలకు మేలు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజాపాలన గ్రామ సభను నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకే గ్రామసభ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయ్‌శేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏఓ లక్ష్మీప్రసన్న, గ్రామ కార్యదర్శి సంతోశ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు శ్రీమాన్‌రెడ్డి, ఎడ్ల కిష్టయ్య, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

అల్లాదుర్గం(మెదక్): శంకర్ రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని చిల్వర ఉన్నత పాఠశాలకు 25వేల పుస్తకాలను పంపిణీ కోసం శనివారం చెక్కును అందించారు. ఇందులో ఫౌండేషన్ సభ్యులు రఘువీర్, బాల్‌రాజ్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా బోధనను రద్దు చేయాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు, అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న ఉన్నత, ఎస్ఎల్ఎస్ విద్యా బోధనను రద్దుచేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వమైన ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడే డీఏలను సంక్రాంతి పండగ లోపు అందించాలని కోరారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ప్రధానమైన సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ మన్నన్, మిర్జాపల్లి, సూరారం, చందంపేట జెడ్పీహెచ్ఎంలు పుష్పవేణి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, జబ్బార్, గోపాల్, జహిరొద్దీన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బడి బయట పిల్లల సర్వే**

నర్సాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం బడి బయట ఉన్న పిల్లల సర్వేను చేశారు. సీఆర్‌పీ సుజాత, పట్టణంలోని రెండు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు లాలు, సర్వేశ్‌లతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పట్టణంలో సర్వే చేపట్టి 14 ఏళ్ల లోపు పిల్లలు బడి బయట ఉన్న వారి వివరాలు సేకరించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో బడిఈడు పిల్లలపై ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. సీఆర్‌పీ సంతోష్‌రెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

◆ **మనోహరాబాద్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి**

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో చిన్నశంకరంపేట తహసీల్దార్‌లో విధులు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు.

◆ **మట్టిరోడ్లను తారురోడ్లుగా మారుస్తాం**

టేక్మాల్(మెదక్): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు తండాల్లోని మట్టిరోడ్లను తారు రోడ్లుగా మారుస్తామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. శనివారం మండలంలోని షాబాద్, నల్లకుంట, హసన్‌మమ్మద్‌పల్లి తండా, కాద్లూర్‌తండా, బొల్లికుంటతండా, కేవ్లాతండా, దండువానికుంట తండాల మట్టిరోడ్లను ఆర్అండ్‌బీ ఎఈ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఇందులో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు సేవాలాల్, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ నరేందర్, నాయకులు రమేశ్ పాల్గొన్నారు.


◆ **అపరిచితులతో అప్రమత్తంగా ఉండండి**

మనోహరాబాద్(తూప్రాన్): మూఢనమ్మకాలు నమ్మొద్దని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. శనివారం మండలంలోని రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే వెంటనే 87126 57888కు గానీ, 100కు గానీ డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సంజీవరావు, పోలీస్ కళాబృందం సభ్యులు ఉన్నారు.

◆ **ఉపాధిహామీ సామాజిక తనిఖీ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలు జరుగుతున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్ శనివారం తెలిపారు. 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 270 రకాల పనులు జరిగినట్లు చెప్పారు. దీనికి కూలీలకు రూ. 5.69 కోట్లు, మెటీరియల్ పనులు రూ 12.66లక్షల పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **వైభవంగా సంప్రదాయ దినోత్సవం**



నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో శనివారం సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబెలు ఎండ్ల బండిపై తమ కార్యాలయం నుంచి ఆడిటోరియం వరకు వచ్చారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామంలో శనివారం మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మణ్, మెడిసిటి వైద్యులు డాక్టర్ అర్పిత, ప్రియాంక, దివ్యరావు, ఐశ్వర్య, పీఆర్ఓలు సంజయ్, రాజు, వీర్‌కుమార్ పాల్గొన్నారు.

◆ **దరఖాస్తు చేసుకోవాలి**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గూడూర్ గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల వసతిగృహంలో వంట మనిషి పోస్టు ఖాళీగా ఉందని ప్రత్యేక అధికారి మంజుల తెలిపారు. 10 తరగతి చదివి శివ్వంపేట మండలానికి చెందిన మహిళలు అర్హులన్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు విద్యా అర్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **దుప్పట్ల పంపిణీ**

టేక్మాల్(మెదక్): మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన ఎల్లంపల్లి నాగేశ్ హైదరాబాద్ వాస్తవ్యులు డాక్టర్ రాజేశ్వర్ సౌజన్యంతో శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264